నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | KHAMMAM

ఖమ్మం నగరంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన ఎంపీ వద్దిరాజు, హరిప్రియ, ఆర్జేసీ కృష్ణ. పగడాల నాగరాజు, కుల సంఘాల నాయకులు

బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోం..

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి
- విద్య, ఉపాధి, రాజకీయపరంగా వేర్వేరు బిల్లులను పెట్టాలి
- కుల సర్వే, డెడికేటెడ్ కమిషన్ నివేదికలను బహిర్గతం చేయాలి
- బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మం, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని, బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునేదిలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46శాతం ఉన్నారని, రీ సర్వే చేయడంతో మరో 1.5 లేదా 2శాతం బీసీల జనాభా పెరుగుతుందని తెలిపారు. అంటే మొత్తం బీసీల జనాభా దాదాపు 48శాతం ఉంటుందని అంచనా వేశారు. 48శాతం బీసీలు ఉంటే... ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారు ? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఈ మూడు రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ ఒక్క అంశంపై అయినా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం బిల్లు చెల్లకుండాపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు రంగాలకు సంబంధించి వేర్వేరు బిల్లులను పెట్టాలని డిమాండ్ చేశారు. ముస్లింలు, బీసీలకు కలిపి మొత్తం 56శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింలకు మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ముస్లింల జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్లు కల్పించాలని, ముస్లింల పేరు చెప్పి ఆయా వర్గాల మధ్య పంచాయతీ పెట్టవద్దని సూచించారు. గ్రామాల వారీగా ఏ కులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం బయటపెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఇప్పటివరకు ప్రభుత్వం బయట పెట్టలేదని, దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా లెక్కలు సరైనవా కావా అన్నది ప్రజలు తేల్చుకోగలుగుతారని తెలిపారు. సర్వేలో పాల్గొనని వారికి మరోసారి అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, రీ సర్వేకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని, టోల్ ఫ్రీ నెంబరులో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిందని, అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ పదవుల్లో బీసీలకు 51శాతం అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తుచేశారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే ద్వారా తేలిన జనాభా ప్రకారం నిధులు ఖర్చు చేసుకున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ ఉంటే అభివృద్ధిలో భారత్ ఎప్పుడో అమెరికాను దాటిపోయేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం కోసం పోరాటం చేస్తుందని, సామాజిక దృక్పథంతో పనిచేస్తున్న సంస్థ తెలంగాణ జాగృతి అని చెప్పారు. జాగృతి పోరాటాల వల్లనే అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, బతుకమ్మ పండగకు రాష్ట్ర హోదా సాధ్యమయ్యిందని గుర్తుచేశారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, మదన్‌లాల్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఆర్జేసీ కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దండిగాల రాజేందర్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఎంబీసీ రాష్ట్ర నాయకురాలు షకీనా, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఉమా, యండపల్లి వరప్రసాద్, మరికంటి ధనలక్ష్మి, నిరోష, ఇంటూరి శేఖర్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి కేసీఆర్..

బీసీలు తమ భావితరాల వారి మంచి కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలి. కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమం, ఉన్నతికి కృషి చేసి, రాష్ట్రాన్ని బంగారుమయం చేశారు. అందుకు భిన్నంగా రేవంత్‌రెడ్డి తెలంగాణను అధ్వాన్నంగా తయారు చేస్తున్నారు. 59వేల కోట్లున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను కేసీఆర్ 3లక్షల కోట్లకు తీసుకుపోయారు. బీసీలకు రాజ్యాధికారంలో సముచిత ప్రాధాన్యతనిచ్చి గౌరవించిన గొప్ప నాయకుడు కేసీఆర్.

– వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు

మున్నూరుకాపులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో రాష్ట్రంలో మున్నూరుకాపు జనాభాను తగ్గించి చూపడం వల్ల మున్నూరుకాపులకు తీరని నష్టం వాటిల్లనుంది. బీఆర్ఎస్ హయాంలో చేసిన సర్వేలో మున్నూరుకాపులు 22శాతం ఉంటే కాంగ్రెస్ వారు మూడున్నర శాతం తక్కువ చేసి చూపించారు. రాజకీయ అవకాశాలు లేక కాపులు నష్ట పోతున్నారు. బీసీలందరూ ఐక్యం కావాలి. రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలి.

– ఆర్జేసీ కృష్ణ మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు

బీసీలంతా ఏకమైతే రాజ్యాధికారం ఖాయం

రాష్ట్ర జనాభాలో 50శాతానికి పైగా ఉన్న బీసీ కులాలు అన్ని ఏకమైతే రాజ్యాధికారం తప్పక దక్కుతుంది. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి మరొకరికి లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మంలో బీసీలకు అనేక పదవులు వచ్చాయి. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందాలి. బీసీలకు 46 శాతం రిజర్వేషన్లు దక్కాలి.

– పగడాల నాగరాజు, యాదవ సంఘం నాయకులు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

- కేసీఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం కాంగ్రెస్ తరంకాదు
- లక్కినేని సురేందర్‌కు అండగా బీఆర్ఎస్: ఎమ్మెల్సీ కవిత

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలో ఉన్న జిల్లా జైలులో బేతంపూడి సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నేత లక్కినేని సురేందర్, ఎస్టీ సెల్ నాయకుడు భూక్యా రాజును శనివారం కవిత పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి జైలులో ములాఖత్ ద్వారా వారిని పరామర్శించారు. అనంతరం జైలు వెలుపల ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. టేకులపల్లి మండలానికి చెందిన నాయకుడు లక్కినేని సురేందర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు మోపి 12 రోజుల నుంచి జైలులో పెట్టిందన్నారు. కారణం లేకుండా ప్రజా నాయకులను టార్గెట్ చేస్తూ ఎస్టీ, ఎస్సీ చట్టాన్ని సైతం దుర్వినియోగం చేస్తూ కేసులు బనాయిస్తున్నారన్నారు. కేసీఆర్‌ను, కేసీఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరి వల్ల కాదని కాంగ్రెస్ సర్కార్ తెలుసుకోవాలన్నారు. ఒక్కరిద్దరిని జైలులో పెట్టవచ్చు కానీ, ప్రశ్నించడం మాత్రం ఆపలేరని స్పష్టంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి వెళ్లిపోయాయని, రైతుబంధు రాని రైతులు, రేషన్‌కార్డులు రాని లబ్ధిదారులు, ఉద్యోగాలు రాని యువకులు ఈ కాంగ్రెస్ మాటలు ఒట్టివేనని గ్రహించారని అన్నారు. 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఏమీ వెలగబెట్టింది లేదని ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. ఆ భయంతోనే ఎవరు ప్రశ్నిస్తే వాళ్లపై కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఏమి తప్పుచేశారని సురేందర్‌ను జైలుపాలు చేశారని ప్రశ్నించారు. గ్రామసభలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాడని అన్నారు. ఇకపైనా కచ్చితంగా ప్రశ్నిస్తామని అన్నారు. పాలన చేతకాక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చే వరకు వెంటపడుతామన్నారు. బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నాయకత్వం సురేందర్‌కు మద్దతుగా నిలబడుతుందన్నారు. రాష్ట్రంలో ఏమూలన, ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా ఇదే తీరుగా అండగా నిలబడి కాపాడుకుంటామన్నారు. కేసులకు భయపడేదిలేదని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ దాష్టీకాలను తెలంగాణ సమాజం గమనించాలన్నారు.

జైలులో బీఆర్ఎస్ నేతలను పరామర్శించి వస్తున్న కవిత, రవిచంద్ర, తాతా, చిత్రంలో హరిప్రియ, లింగాల

వృక్షార్చన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

17న 'ఊరూరా వృక్షార్చన'

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఫిబ్రవరి 15 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న ఊరూరా వృక్షార్చన కార్యక్రమం చేపట్టాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. తన స్వగృహంలో వృక్షార్చనకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఒక్కొక్కరూ మూడు మొక్కల చొప్పున నాటాలని కోరారు. వృక్షార్చన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యమూర్తి సంత్ సేవాలాల్

సంత్‌శ్రీ మహారాజ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 15: బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన చైతన్యమూర్తి సంత్ సేవలాల్ మహరాజ్ అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ విపాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద ఉన్న కార్తీక వనంలో సేవాలాల్ జయంతిని వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్‌లను సంప్రదాయ దుస్తులతో ఎండ్ల బండిపై ఎక్కించి స్వాగతం పలికారు. అనంతరం వారు భోగ్‌బండారో తంతు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ తన బోధనల ద్వారా బంజారా జాతి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. హింస, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికేవారన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున బంజారా ఉద్యోగులు హాజరయ్యారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

- ఉచిత బస్సులతో ఆటోలు నడవడం లేదని ఆవేదన
- కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్‌మియా

తీగలబంజర గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆటో కార్మికులు

కొణిజర్ల, ఫిబ్రవరి 15 : ఆటో మోటార్ కార్మిక ఐక్య రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తీగలబంజర గ్రామంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే లాల్‌మియా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 6.5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీలు చదివి ఏ ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకొని నడుపుకుంటుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వారి నోట్లో మట్టి కొట్టిందన్నారు. ఉచిత బస్సుల వల్ల మహిళలు ఆటోలు ఎక్కకపోవడంతో ఆర్థికంగా సతమతమవుతున్నారని, వందలాదిగా ఆటో కార్మికులు కిస్తీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షల చొప్పున చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు భూక్యా బాలు, ముత్తనబోయిన లెనిన్, చందు, భాష, చంద్రియ, మంగ్యా, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు

- 35 మందికి నియామక పత్రాలు
- ఖాళీలన్నీ ప్రదర్శించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 15 : విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లాకు డీఎస్సీ-2008 అభ్యర్థుల వివరాలు చేరడంతో నగరంలోని డైట్ కళాశాలలో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అనుమతి తీసుకున్న విద్యాశాఖ అధికారులు శనివారం ఉదయం 7 గంటలకే అభ్యర్థులకు డీఈవో కార్యాలయ సిబ్బంది ఫోన్ చేశారు. కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సమాచారం అందించారు. దీంతో మధ్యాహ్నం 2.30 గంటలకు డైట్ కళాశాలలో కౌన్సిలింగ్ ప్రారంభమైంది. డీఈవో సోమశేఖర శర్మ, డీఎల్‌పీవో రాంబాబు అబ్జర్వర్‌గా ప్రక్రియను పర్యవేక్షించారు. తొలుత ఏపీవో ఎస్.శ్రీనివాసరావు అభ్యర్థులకు ఆప్షన్ ఫామ్స్, బాండ్ ద్వారా అందజేయాల్సిన అండర్ టేకింగ్‌లో పొందుపర్చాల్సిన అంశాలపై వివరించారు.

డీఎస్సీ-2008 అభ్యర్థి నుంచి ఆప్షన్స్ తీసుకుంటున్న డీఈవో కార్యాలయ సిబ్బంది, చిత్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, పరిశీలకుడు

45 మందికి.. 35 మంది హాజరు..

డీఎస్సీ-2008లో జిల్లాకు 45 మందిని కేటాయించగా.. వీరిలో ముగ్గురు అభ్యర్థులు ఇటీవల నిర్వహించిన డీఎస్సీ -2024లో ఉద్యోగాలు పొందారు. మిగిలిన 42 మందితో కౌన్సిలింగ్ నిర్వహించగా.. ఏడుగురు గైర్హాజరయ్యారు. 42 మంది అభ్యర్థులకు.. 42 ఖాళీలను ప్రదర్శించగా మెరిట్ ఆధారంగా ఒకరి తర్వాత ఒకరిని పిలిచి ఎంపిక చేసుకున్న పాఠశాలల వివరాలు తీసుకున్నారు. వాటితోపాటు ప్రతీ ఒక్కరి నుంచి మూడు ఫొటోలు తీసుకున్న తర్వాత నియామక పత్రాలు అందజేశారు. సోమవారం పాఠశాలల్లో చేరే సమయంలో రూ.వంద బాండ్ పేపర్‌ను ఎంఈవోకు అందజేయాలని సూచించారు. సాయంత్రం 6 గంటలకు ప్రక్రియ ముగిసింది. నరుకుళ్ల శ్రీనివాస్, వజ్జా కిశోర్, మాలోతు దేవేందర్‌కుమార్, కే శ్రీనివాసరావు, యూసుఫ్ పాషా, వై.శ్రీనివాసరావు, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీలన్నీ ప్రదర్శించాలి : ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

అభ్యర్థుల కోసం అన్ని ఖాళీలను ప్రదర్శించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈవో సోమశేఖర శర్మని డిమాండ్ చేశారు. నగరంలోని 17 శాతం హెచ్ఆర్ఏ వంటి స్థానాలు కూడా ప్రదర్శించాలని విజ్ఞప్తి చేయగా.. ఉపాధ్యాయులు అవసరమైన చోట ఎంఈవోల నుంచి వివరాలు సేకరించి భర్తీ చేస్తున్నామని, ఈ ప్రక్రియకు ఆటంకం కల్పించొద్దని కోరారు. పీఆర్‌టీయూ, టీపీటీఎఫ్, యూటీఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తాగునీరేది?

- అన్ని శాఖలు కార్యాలయాలకూ బయటి నీరే దిక్కు
- 'ప్రజావాణి' అర్జీదారులకూ తప్పని తాగునీటి తిప్పలు
- మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నా ఉపయోగం సున్నా..

కొత్తగూడెం ఐడీఓసీ వెనుక భాగంగా నిర్మించిన భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : ఎక్కడో తాగునీటి సమస్య ఉందంటూ అక్కడి ప్రజలు మొరపెట్టుకుంటుండడాన్ని మామూలుగా చూస్తూనే ఉంటాం. కానీ సాక్షాత్తూ జిల్లా పెద్దసారు (కలెక్టర్) పాలనా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఐడీవోసీలోనే తాగునీటి సమస్య ఉందంటే నమ్ముతారా? కానీ నమ్మాలి. అది నిజం కూడా. ప్రజల సౌలభ్యం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో కొత్తగూడెంలో కలెక్టరేట్‌ను నిర్మించింది. అన్ని శాఖలనూ ఒకే చోటకు చేర్చింది. దీంతో రోజూ ప్రజలందరూ ఇక్కడికి వచ్చి ఆయా శాఖల అధికారులను కలిసి తమ సమస్యలున విన్నవించుకుంటున్నారు. కానీ ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులను, ఉద్యోగులను, వారికి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులను తాగునీటి సమస్య వెంటాడుతోంది.

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 50కి పైగా శాఖల అధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ప్రతీ సోమవారం జరిగే 'ప్రజావాణి'లో తమ సమస్యలపై వినతులు ఇవ్వడానికి వందలాదిమంది అర్జీదారులు వస్తున్నారు. కానీ వీరందరికీ ఈ కలెక్టరేట్‌లో గుక్కెడు నీళ్లు లభించడం గగనంగా మారింది. దీంతో అందులో పనిచేసే ఉద్యోగులు, ఉన్నతాధికారులు బయట నుంచి టిన్నుల ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నారు. మరుగుదొడ్ల వినియోగానికి బోర్ నీటిని వినియోగించుకుంటున్నప్పటికీ తాగునీటికి మాత్రం కటకట ఏర్పడుతోంది. అయితే, బయటి నుంచి టిన్నులు తెచ్చుకునే క్రమంలో కొంచెం ఆలస్యం జరిగినా ఆ కార్యాలయంలోని అధికారులకు గొంతెండుతున్న పరిస్థితి. కార్యాలయాలకు వచ్చే ఇతర ప్రముఖులకు కూడా సకాలంలో నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. అత్యవసరమైతే క్యాంటీన్‌కు వెళ్లి తాగాల్సిన దుస్థితి. ఇక ప్రజావాణి కార్యాలయంలో ఏర్పాటుచేసిన వాటర్ టిన్నులోని నీళ్లు కొద్దిమంది తాగగానే అయిపోతున్నాయి. మిగతా వాళ్ల గొంతు ఎండాల్సిన పరిస్థితి.

భగీరథ ట్యాంకు ఉన్నా.. ఉపయోగం సున్నా..

కలెక్టరేట్ పైభాగంలో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. వాటర్ గ్రిడ్ ద్వారా ఆ ట్యాంకుకు భగీరథ నీరు చేరుతుంది. కానీ అది కలెక్టరేట్‌లోని కార్యాలయాలకు మాత్రం వెల్లడం లేదు. కలెక్టరేట్‌కు నల్లాల కనెక్షన్లు లేనందునే నీళ్లు వెళ్లడంలేదని భగీరథ అధికారులు చెబుతున్నారు. పైపులైన్లు ఉంటే నీరు సరఫరా చేస్తామని పాల్వంచ మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అసలే వేసవికాలం కదా..

పెద్ద సారు కార్యాలయంలో తాగునీటి సమస్య ఉండకూడదు. అసలే వేసవి కాలం. దప్పికకు తాళలేం. కలెక్టరేట్‌కు చాలామంది ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, షుగర్ పేషెంట్లకు నీళ్లు అందుబాటులో ఉండాలి. కుండలతోనైనా చల్లని నీటిని ఏర్పాటు చేస్తే మంచిది. ఆసుపత్రుల్లో ఉన్నట్లుగానే ఇక్కడ కూడా వాటర్ కూలర్లు పెట్టి తాగునీటిని అందుబాటులో ఉంచాలి.

–శ్రావణబోయిన నర్సయ్య. కొత్తగూడెం

పైపులైన్ నల్లాలకు ప్రతిపాదనలు తయారు చేశాం..

ఐడీవోసీ నిర్మాణం జరిగినప్పుడు ఆ సమస్య పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం నల్లాలు ఏర్పాటుచేయడం కోసం ప్రతిపాదనలు తయారు చేశాం. త్వరలో అన్ని కార్యాలయాలకు తాగునీటిని అందుబాటులోకి తీసుకొస్తాం. అప్పటి వరకు ఎవరి ఆఫీసులకు వారు టిన్నులు ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నారు. ప్రజావాణి కార్యాలయంలో కూడా తాగునీటిని ఏర్పాటు చేస్తున్నాం.

–రమాదేవి, పరిపాలన అధికారి, కలెక్టరేట్